## ఓటమి భయంతోనే దాడులు

### బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వీజీగౌడ్

డిచ్‌పల్లి, అక్టోబర్ 31 : సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి భయంతోనే కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడికి పాల్పడడం దుర్మార్గమైన చర్య అని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ వి. గంగాధర్ గౌడ్ అన్నారు. డిచ్‌పల్లిలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి అప్రజాస్వామికమన్నారు. కాంగ్రెస్ నాయకుల చర్యలతో రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఏర్పడిందని విమర్శించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆ పార్టీ నేతలు చర్యలు తీసుకోవాలని, లేదంటే వారికి తగిన బుద్ధి చెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## యాసంగి పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్

బోధన్ రూరల్, అక్టోబర్ 31: బోధన్ మండలంలోని సిద్ధాపూర్ గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు యాసంగి పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్ హుస్సేన్, ప్రోగ్రాం కో -ఆర్డినేటర్ కేవీకే రుద్రూర్ డాక్టర్ అంజయ్యా హాజరై మాట్లాడారు. సూక్ష్మ పోషకాలు, భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ భారతి, శాస్త్రవేత్తలు బాలాజీనాయక్, ప్రవీణ్, వెంకట రాజ్‌కుమార్, బోధన్ వ్యవసాయ శాఖ అధికారి సంతోష్‌నాయక్, ఏఈవో ముజామిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తా..

### బీఆర్ఎస్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి



రేణుకా మాత ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

ధర్పల్లి, అక్టోబర్ 31 : రూరల్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని, ఎన్నికల్లో తనను మళ్లీ ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి కోరారు. ధర్పల్లిలో మంగళవారం రాత్రి ఆయన పర్యటించారు. ముందుగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రేణుకామాత ఆలయ 4వ వార్షికోత్సవంలో పాల్గొని పూజలు చేసి, అమ్మవారి కల్యాణంలో పాల్గొన్నారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, ఎంపీపీ నల్ల సారికా హన్మంత్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు, మండల కన్వీనర్ పీసు రాజ్‌పాల్‌రెడ్డి, సర్పంచ్ ఆర్మూర్ పెద్దబాల్‌రాజ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, సొసైటీ చైర్మన్ చెలిమెల చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ సభ ఆహ్వాన పత్రికల అందజేత

ఆర్మూర్‌టౌన్, అక్టోబర్31: ఆర్మూర్ పట్టణంలో నవంబర్ 3న సీఎం కేసీఆర్ సభ నిర్వహించనున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను స్థానిక ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మంగళవారం వివిధ కుల సంఘాల పెద్దలకు అందజేశారు. కేసీఆర్ బహిరంగ సభకు అన్ని కులాల ప్రజలు తరలిరావాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పండిత్ పవన్, సంజయ్‌సింగ్‌బబ్లూ, పోల సుధాకర్, పార్టీ నాయకులు, కుల సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

## అర్చరీ నేషనల్ గేమ్స్ అబ్జర్వర్‌గా ఈగ సంజీవ్‌రెడ్డి



అర్చరీ గేమ్ అబ్జర్వర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఈగ సంజీవ్‌రెడ్డి

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 31 : గోవాలో జరుగుతున్న 37వ నేషనల్ గేమ్స్‌కు అర్చరీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి, ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఈగ సంజీవ్‌రెడ్డి అర్చరీ గేమ్ అబ్జర్వర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని హైదరాబాద్ అర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అరవింద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన ఈగ సంజీవ్‌రెడ్డి అబ్జర్వర్‌గా వ్యవహరించడంతో జిల్లా క్రీడా సంఘాలు అభినందనలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశాయి.

## జాతీయస్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు సరయూ

డిచ్‌పల్లి, అక్టోబర్ 31 : మండలంలోని ధర్మారం గురుకుల పాఠశాలకు చెందిన సరయూ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ 45వ సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సంగీత మంగళవారం తెలిపారు. హన్మకొండ కాకతీయ యూనివర్సిటీలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకు జమ్ముకశ్మీర్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సరయూతోపాటు స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ నీరజారెడ్డి, పీఈటీ జ్యోత్స్న, సిబ్బందిని ప్రిన్సిపాల్ అభినందించారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం తదితరులు

రెంజల్, అక్టోబర్ 31 : వర్షకాలంలో రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రకటించిన మద్దతు ధర పొందాలని రెంజల్ ఐకేపీ ఏపీఎం భాస్కర్ అన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో బోర్గాం, అంబేద్కర్‌నగర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించారు. వీరన్నగుట్ట గ్రామంలో ఆగ్రో రైతు సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిర్వాహకులు సనాఉల్ హక్ ప్రారంభించారు. కార్యక్రమంలో బోర్గాం గ్రామ కార్యదర్శి సుమన్, సీసీలు కృష్ణ, రాజయ్య, శివకుమార్, మహిళా సంఘాల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# భార్య హత్య కేసులో భర్తకు జీవితఖైదు

నిజామాబాద్ లీగల్, అక్టోబర్ 31 : భార్యను హత్య చేసి పెట్రోల్ పోసి కాల్చివేసిన భర్తకు జీవిత కారాగార శిక్షతోపాటు ఏడు సంవత్సరాల కఠిన జైలుశిక్ష విధిస్తూ నిజామాబాద్ సెషన్స్ జడ్జి సునీత కుంచాల మంగళవారం తీర్పు చెప్పారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాకేంద్రంలోని సీతారాంనగర్‌కు చెందిన జి. గణేశ్‌కు ఇద్దరు భార్యలు ఉన్నారు. మొదటి భార్య నిర్మలకు ఇద్దరు కుమార్తెలు. నిర్మలతో విబేధాల కారణంగా మాక్లూర్ మండలంలోని బొంకన్‌పల్లి గ్రామానికి చెందిన రాణిని రెండో వివాహం చేసుకున్నాడు. ఆమె ఓ కూతురుకు జన్మనిచ్చింది. రాణి నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో ఆయాగా పనిచేసేది. భార్య రాణిపై అనుమానం పెంచుకున్న గణేశ్.. ఆమెను హత్య చేయాలని పథకం పన్ని 4 అక్టోబర్ 2022న ఆటోలో మాక్లూర్ మండలంలోని ముల్లంగి గ్రామశివారులోకి ఆమెను తీసుకెళ్లాడు. చీర కొంగును ఆమె మెడకు చుట్టి హత్య చేశాడు. అనంతరం గోనెసంచులు మృతదేహంపై వేసి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. పోలీసుల నేర విచారణలో మృతురాలి కుమార్తె మృతదేహం కాళ్లకు ఉన్న మెట్టెలు, ముక్కుపుడక, పుస్తెల తాడును గుర్తించింది. కోర్టు నేరన్యాయ విచారణలో మొత్తం 15 మంది ప్రత్యక్ష సాక్ష్యుల వాంగ్మూలాలు, 14 ధ్రువీకరించిన పత్రాలు, 9 వస్తుగత సాక్ష్యాధారాలు పరిశీలించి ముద్దాయి గణేశ్ హత్యకు పాల్పడినట్లు నిర్ధారిస్తూ జీవిత కారాగార శిక్షతోపాటు రూ.2వేల జరిమానా విధించారు. శవాన్ని కాల్చివేసి సాక్ష్యాన్ని రూపుమాపడానికి ప్రయత్నించిన నేరానికి మరో ఏడేండ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. రెండు శిక్షలు ఏకకాలంలో అనుభవించాలని సెషన్స్ జడ్జి సునీత కుంచాల తమ తీర్పులో పేర్కొన్నారు. కన్నతల్లి హత్యకు గురికావడం, తండ్రి కటకటాల్లోకి వెళ్లడంతో ఒంటరి అయిన వారి 16 ఏండ్ల కూతురుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తరపున తగిన ఆర్థిక పరిహారం అందించాలని జడ్జి తన తీర్పులో సిఫార్సు చేశారు.



కలెక్టరేట్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, అధికారులు



జిల్లా కేంద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

# ఘనంగా రాష్ట్రీయ ఏక్తా దివస్

నిజామాబాద్ స్పోర్ట్స్/ నిజామాబాద్ కల్చరల్/ నిజామాబాద్ లీగల్/ నిజామాబాద్ క్రైం, అక్టోబర్ 31 : నగరంలోని కలెక్టరేట్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని రాష్ట్రీయ ఏక్తా దివస్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు.. అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. దేశ ఐకమత్యం, సమగ్రత, భద్రతను కాపాడడానికి అంకితభావంతో కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారిణి ఎన్.పద్మశ్రీ, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. నగరంలోని శబ్ద తరంగిణి సంస్థ కార్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని నిర్వహించారు. దేశానికి ఆయన చేసిన కృషిని సంస్థ ప్రతినిధులు కొనియాడారు. నిజామాబాద్ పట్టణంలోని బార్ అసోసియేషన్ హాలులో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని నిర్వహించారు. బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఆయన చిత్రపటానికి నివాళుర్పించారు. జిల్లా కేంద్రంలో అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ జయరామ్, గిరిరాజు ఆధ్వర్యంలో సిబ్బంది తో కలిసి రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది కలిసి ప్రతిజ్ఞ చేశారు. దేశంలో (ఉగ్రవాదం/నక్సల్స్)మొదలగు సంఘ విద్రోహశక్తులను ఎదుర్కోవడానికి పోలీస్ సిబ్బంది అందరు చాలెంజ్‌గా తీసుకొని కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా పోలీసులు అధికారులు పేర్కొన్నారు. తమ ప్రాణాలను సైతం అర్పించడానికి వెనుకాడడం లేదన్నారు. దేశ రక్షణ, ప్రజా సేవ కోసం పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీలు రవీందర్ రెడ్డి,వేణుగోపాల్ రెడ్డి, ఆర్ఐలు,ఆఫీస్ సూపరింటెండెంట్లు, ఐటీ కోర్ టీమ్, ఏఆర్,స్పెషల్ పార్టీ సిబ్బంది, హోంగార్డు సిబ్బంది పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీ

జక్రాన్‌పల్లి/వర్ని అక్టోబర్ 31 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపడుతున్నారు. జక్రాన్‌పల్లి మండలంలోని కలిగోట్ ప్రధాన రహదారిపై ఎస్సై తిరుపతి తన సిబ్బందితో కలిసి మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఎలాంటి రసీదులు లేకుండా తరలిస్తున్న రూ.1.50 లక్షలను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. వర్ని మండల కేంద్రంలోమంగళవారం తనిఖీలు నిర్వహించగా.. ఈదల గోపాలకృష్ణ అనే వ్యక్తి వద్ద రూ. రెండు లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. వాటిని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించామని, సరైన పత్రాలు సమర్పిస్తే నగదు తిరిగి అందజేస్తామని పేర్కొన్నారు.

## బీఆర్ఎస్ వెంటే బోధన్ రజక సంఘం

శక్కర్‌నగర్, అక్టోబర్ 31: బీఆర్ఎస్ వెంటే బోధన్ రజక సంఘం ఉంటుందని ప్రతినిధులు మల్లెపువ్వుల సురేశ్ చౌదరి, ప్రవీణ్, గడ్డం మోహన్ స్పష్టం చేశారు. పట్టణంలో రజక సంఘం పేరుపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, అది సరి కాదని పేర్కొన్నారు. రజక కుల సంఘం అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న పెంటోళ్ల లక్ష్మణ్, మల్లెపువ్వుల శంకర్ తమ సంఘంలోని వంద కుటుంబాలు తమ వెంటే ఉన్నాయంటూ ప్రచారం చేసుకుంటున్నారని తెలిపారు. సదరు వ్యక్తులు బీఆర్ఎస్ ప్రభుత్వం ద్వారా బీసీ బంధు పొందడంతోపాటు రజక సంఘం పేరు చెప్పి ఇతరులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సదరు వ్యక్తులకు తమ రజక సంఘానికి ఎలాంటి సంబంధం లేదని, తమ సంఘం బీఆర్ఎస్ పార్టీకి పూర్తి మద్దతుగా ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో శేఖర్ చౌదరి, కుమ్మన్‌పల్లి రమేశ్ ఉన్నారు.